ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
మంగళవారం 23 ఏప్రిల్ 2024

మూల మలుపులు.. ప్రమాదాలకు నిలయాలు 8
నిలిచిన పాఠశాల భవన నిర్మాణ పనులు 8



పాఠశాలలకు వేసవి సెలవులు

- రేపటి నుంచి ప్రారంభం
- జూన్ 12న తెరుచుకోనున్న బడులు
- ఆట సామగ్రి కొనుగోలుపై పిల్లల ఆసక్తి
- అనుబంధాలను పెంచనున్న వేసవి విడిది
- నేడు వేసవి సెలవుల వినియోగంపై పేరంట్స్ మీటింగ్‌లు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పాఠశాల విద్యార్థుల వార్షిక పరీక్షలు ముగిసాయి. మంగళవారం ఆన్‌లైన్‌లో నమోదు చేసిన మార్కుల జాబితాలను అందించనున్నారు. ఇదే సందర్భంలో వేసవి సెలవుల వినియోగంపై పాఠశాలల్లో పేరెంట్స్ మీటింగ్‌లు నిర్వహించనున్నారు. కొన్ని పాఠశాలల్లో ఉచిత సమ్మర్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. సంవత్సరంపాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు ఎదురు చూస్తున్న సెలవుల బుధవారం నుంచి మొదలవనున్నాయి. సెలవులతో వేసవి పిల్లలకు ఆటవిడుపుగా మారనుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 655 పాఠశాలల్లో 75,473 మంది విద్యార్థులు ఉండగా బాలురు 37,440 మంది, బాలికలు 38,068 మంది ఉన్నారు. ప్రభుత్వ, జడ్పీహెచ్‌ఎస్, కేజీబీవీ, టీఎస్‌ఎంఎస్, డీఎన్‌టీ, ఎంపీపీఎస్, ఎంపీయూపీఎస్, ఎంపీ హెచ్‌ఎస్, ఆర్బీఎస్, పాఠశాలల్లో 44,555 మంది విద్యార్థులు ఉండగా తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలో 7136 మంది విద్యార్థులు, ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల్లో 150 మంది, కేంద్రీయ విద్యాలయంలో 266 మంది, మదర్సాలో ఇద్దరు, ప్రైవేటు పాఠశాల్లో 23,364 మంది విద్యార్థులు ఉన్నారు. వేసవి సెలవుల తరువాత జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి. దాదాపు నెల రోజులపాటు వారి అల్లరి తట్టుకోవడానికి తల్లిదండ్రులు ఆటవిడుపును అందించేందుకు సిద్ధమవుతున్నారు. తల్లిదండ్రులు రకరకాలైన ఆట వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు కూడా సీజన్ బట్టి కొత్త కొత్త రకాల ఆట వస్తువులను తీసుకొచ్చారు. ఈ సారి పిల్లలు ఎలక్ట్రానిక్‌కు సంబంధించిన గేమ్‌లను కొనుగోలు చేస్తున్నారు. చిన్న పిల్లలకు ఆటలతోపాటు మేథస్సుకు పదును పెట్టే బిజినెస్ గేమ్స్, వీడియో గేమ్స్‌పై ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు స్విమ్మింగ్, స్కేటింగ్, టెన్నిస్, బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్, విభాగాల్లో శిక్షణ ఇవ్వడానికి శిబిరాలు వెలిశాయి. హ్యాండ్ బాల్, చెస్ క్రీడలను కూడా విద్యార్థులు ఇష్టపడుతున్నారు. క్రికెట్, షటిల్స్ బ్యాట్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. పిల్లలందరూ ఒక చోట చేరి క్యారం వంటి ఆటలే కాకుండా పాత కాలపు పచ్చీస్, కైలాసం, ఆటలు ఆడుతున్నారు. వీటికనుగుణంగానే గతేడాదికంటే ఈ సంవత్సరం ఆట సామగ్రి 30 శాతం పెరిగింది.క్యారం బోర్డులు రూ.250 నుంచి రూ.1800, షటిల్ బ్యాట్లు రూ.100 నుంచి రూ.550, బిజినెస్ గేమ్‌లు రూ.100 నుంచి రూ.200, చెస్‌బోర్డు, కాయిన్‌లు రూ.50 నుంచి రూ.1500 వరకు, టెన్నికాయ్ రూ.30 నుంచి రూ.80, టీవీ వీడియో గేమ్స్ రూ. 400 నుంచి రూ.600వరకు, ఇంగ్లీష్ లర్నింగ్ గేమ్స్ రూ.600, ప్లేస్టేషన్‌లు రూ.12 వేలు, తంబోలా రూ. 100, ఎలక్ట్రికల్ ఇతర గేమ్‌లు కూడా రూ.1200 వరకు లభిస్తున్నాయి.

● వేసవిలో జాగ్రత్తలు

వేసవిలో పిల్లల పట్ల జాగ్రత్తలు వహించాలి. భగ్గుమంటున్న ఎండలు పిల్లలను అస్వస్థతకు గురిచేస్తాయి. ప్రధానంగా మధ్యాహ్నం వేళల్లో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు వహించాలి. ఎండలో తిరగడంతో వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉది. వేసవిలో ఎక్కువగా చెరువులు, వాగులు, బావుల వద్దకు స్విమ్మింగ్ వెళ్లడానికి ఆసక్తి చూపుతారు. ఈతలో అనుభవం లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతారు. పిల్లలు సెల్‌ఫోన్, సినిమాలు చూడడం, గేమ్స్ ఆడడంపై కాకుండా నాలెడ్జ్ పెంచుకునే విధంగా జనరల్ నాలెడ్జ్ స్టోరీ బుక్స్ చదివే విధంగా ఆసక్తి పెంచాలి. పాజిటివ్ థింకింగ్ మేడిటేషన్, యోగాపై ఆసక్తి కల్పించాలి.

● అనుబంధాలను పెంచనున్న సెలవులు

యాంత్రిక జీవితంలో పట్టణాలకే పరిమితమైన పెద్దలతోపాటు పిల్లలు గ్రామాల్లో ఉండే అమ్మమ్మలు, నాన్నమ్మలతో గడిపే సమయమే దొరకదు. శుభాకార్యాల సమయంలో, పండుగల సందర్భంలో కలవడమే కనిపిస్తోంది. ఒకటి రెండు రోజులకు మించి పిల్లలు ఊళ్లలో గడిపే అవకాశం ఉండదు. వేసవి సెలవులు వచ్చాయంటే పిల్లలు ఎంచక్కా గ్రామాల్లో ఉండే అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్య ఇళ్లకు వెళ్లవచ్చని భావిస్తారు. అక్కడ ఉండే బాబాయ్‌లు, అన్నయ్యలు, బావలు, పిన్నిలు, పెద్దమ్మలు, వదినలు ఇలా రకరకాల బంధువులువారి పిల్లలతో కలిసి గడుపుతారు. వివిధ రకాల వ్యక్తులు, పిల్లలు, మాటతీరు, వ్యవహారశైలి, భావోద్వేగాలు, సాంఘీక శైలి కూడా తెలుసుకునే అవకాశం లభిస్తుంది. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని సంప్రదాయ ఆటలపై కూడా ఆసక్తి పెరుగుతోంది.

● టూర్ ప్లాన్

వేసవిలో మరికొందరు విహార యాత్రలు వెళ్లడానికి టూర్ ప్లాన్‌లు చేసుకుంటారు. పిల్లలకు సెలవులు కావడంతో కొందరు తీర్థయాత్రలకు వెళ్లి మొక్కులు తీర్చుకుంటే మరికొందరు ఊటీ, కులుమోనాలి, గోవా, ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. కొత్త ప్రదేశాలకు వెళ్లడం ద్వారా సృజనాత్మకతకు ఉపయోగపడుతాయని భావిస్తున్నారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 22: విద్యార్థులను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని వారికి ప్రభుత్వం ఉన్నత లక్ష్యంతో చదువును నేర్పిస్తుందని జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకలను సోమవారం పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు కేశవరాజు గణేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు అన్ని సౌకర్యాలను కల్పించడంతోపాటు ఉపాధ్యాయుల కొరత లేకుండా చూస్తామన్నారు. ఎంఈవో దూస రఘపతి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లకావత్ మోతీలాల్, ప్రధానోపాధ్యాయిని నాగుల భాగ్యరేఖ, పాఠశాల ఎంపీసీ చైర్మన్ చిలుక అరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఇల్లంతకుంట, ఏప్రిల్ 22: మండలకేంద్రంలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సెస్ ఏఈ రాకేష్‌రెడ్డి తెలిపారు. విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలు తొలగించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 6 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

ఇల్లంతకుంట, ఏప్రిల్ 22: మండలంలోని పెద్దలింగాపూర్‌లో మంగళవారం భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలో బాబుజగ్జీవన్‌రాం వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం కొనసాగుతోంది. మట్టి నమూనాలు ఎప్పుడు సేకరించాలో వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రోగ్రాం అధికారులు అరుణ్‌బాబు, భవ్యశ్రీ పాల్గొన్నారు.

కమనీయం.. మల్లికార్జునస్వామి కల్యాణం



వేడుకల్లో జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22: ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం వేకువజామున లగ్న పట్నం, స్వామి నాగవెళ్లి పట్నం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మల్లికార్జునస్వామి కేతమ్మ, మేడాలమ్మల కల్యాణాన్ని కమనీయంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

గాలి దుమారం.. ఆగమాగం



కొనుగోలు కేంద్రంలోని ధాన్యంలోకి చేరిన వర్షం నీరు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22: జిల్లాలో సోమవారం రాత్రి గాలి దుమారంతో వర్షం కురిసింది. దీంతో అన్నదాతలు ఆందోళనకు గురయ్యారు.ఎల్లారెడ్డిపేట మండలంలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. గాలివానకు మామిడి నేలరాలింది. కరెంటు సరఫరా నిలిచిపోవడంతో మండలంలోని ఆయా గ్రామాల్లో అంధకారం నెలకొంది. సుమారు రెండు గంటలపాటు ప్రజలు చీకట్లోనే కాలం వెళ్లదీయాల్సి వచ్చింది.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో సోమవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం సమీపంలో విద్యుత్ స్తంభం ఓ భవనంపై పడి కిందపడింది. మండల కేంద్రంలో ప్రదాన రహదారి వెంట డ్రెయినేజీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. పనుల్లో భాగంగా ఎక్స్‌కావేటర్‌తో కాలువను విద్యుత్ స్తంభాల పక్క నుంచి తీయడంతో ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ స్తంభాలకు విద్యుత్ సరఫరా లేకుపోవడంతో ప్రమాదం జరగలేదు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలో సోమవారం ఈదురు గాలులతోపాటు చిరు జల్లులు పడ్డాయి.

గంభీరావుపేట: మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో సోమవారం రాత్రి వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బందులు పడ్డారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంతోపాటు నర్సింగపూర్, కట్టలింగంపేట, మర్రిగడ్డ, తిమ్మాపూర్, మల్యాల తదితర గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి కురిసిన వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. ధాన్యం కవర్లపై నిలిచిన నీటిని రైతులు తొలగించడానికి రైతులు కష్టాలు పడ్డారు. మర్రి గడ్డ, చందుర్తి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం రాశులలో నీరు చేరడంతో నీటిని తొలగించేందుకు ఇబ్బందులు పడ్డారు. కొన్ని కేంద్రల్లో నిల్వ ఉన్న ధాన్యం పాక్షికంగా తడిసింది. తడిసిన ధాన్యంతోపాటు రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాని కోరారు.



తెగిపడిన విద్యుత్ తీగ

కాంగ్రెస్‌కు ఓటేసి గోసపడుతున్నారు

- బీజేపీకి ఓటేస్తే ఆగమై పోతారు
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్
- వినోద్‌కుమార్‌ను గెలిస్తే డబుల్ ఇంజన్‌లా పనిచేస్తాం : ఎమ్మెల్యే 'గంగుల'



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

కరీంనగర్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను అమలు చేయలేదని, ఆ పార్టీకి ఓటేసిన రాష్ట్ర ప్రజలు గోసపడుతున్నారని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా మల్యాలలో సోమవారం రోడ్‌షోలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఐదేళ్లలో ఒక బడి తేలేదు, ఒక గుడి తేలేదని విమర్శించారు. ఎంపీగా నియోజకవర్గ అభివృద్ధి మాట దేవుడెరుగు, ఆలయాల అభివృద్ధి కోసం ఐదు రూపాయలు కూడా తీసుకురాలేదని అన్నారు. తెలంగాణకు 23 నవోదయ పాఠశాలలు రావలసి ఉంటే పదేళ్ల బీజేపీ పాలనలో ఒక్క పాఠశాల కూడా తేలేదని తెలిపారు. నవోదయ పాఠశాలలను ఎందుకు తీసుకురాలేదని ఓట్ల కోసం వచ్చే సంజయ్‌ని నిలదీయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేగా ఓడిపోయిన ఆయన ఎంపీగా పోటీ చేస్తున్నాడని, సంజయ్‌కి కరీంనగర్ ఎంపీ పదవి పునరావాస కేంద్రమా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో సంజయ్ ఏనాడూ ప్రజా సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. తనను ఎంపీగా గెలిపిస్తే కరీంనగర్‌కు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను తీసుకువస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం గారడీ మాటలు, మోసపూరిత హామీలిచ్చి మభ్యపెడుతోందని, నాలుగు నెలల్లోనే కాంగ్రెస్‌పై ప్రజలకు విసుగు వచ్చిందని వినోద్‌కుమార్ అన్నారు.

కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత హక్కుల గురించి పార్లమెంట్‌లో గళమెత్తి ప్రశ్నించే గొంతుక కావాలని, కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్ స్మార్ట్‌సిటీ తీసుకువచ్చారన్నారు. కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్ గెలిస్తే ఎమ్మెల్యేగా తాను రాష్ట్రంలో, ఎంపీగా వినోద్‌కుమార్ పార్లమెంట్‌లో పోరాడి డబుల్ ఇంజన్‌లా పనిచేసి నిధులు తెచ్చి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామన్నారు. కాంగ్రెస్ వచ్చిన నాలుగు నెలల్లోనే కరువు తీసుకువచ్చిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టిందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు కర్రుకాల్చి వాతపెట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీటీసీ రాంమోహన్‌రావు, సింగిల్ విండో చైర్మన్లు సాగర్‌రావు, మధుసూదన్‌రావు, రామలింగారెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామి శకటోత్సవం



పొత్తూర్‌లో బండ్ల ప్రదక్షణ

ఇల్లంతకుంట, ఏప్రిల్ 22: మండలంలోని పొత్తూర్‌లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం చుట్టూ సోమవారం నిర్వహించిన శకటోత్సవం వైభవంగా సాగింది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఎండ్ల బండ్లు, వాహనాలను ఆలయం చుట్టూ తిప్పారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. జడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, ఎంపీటీసీ పట్నం అశ్వినిశ్రీనివాస్, మాజీ సర్పంచ్ సిద్దం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం మామిడిపల్లి సీతారాముల ఆలయ ంలో రైతులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ఆలయం చుట్టూ ర్యాలీ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా పాడి పంటలు, కుటుంబ సభ్యులు బాగుండాలని మొక్కులు చెల్లించుకున్నారు.

బాధితులకు సత్వర న్యాయం : ఎస్పీ



ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 22: బాధితులకు సత్వర న్యాయం చేయడమే లక్ష్యమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 14 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్ డే ప్రతీ వారం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ ఫిర్యాదుపై తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ఫిర్యాదులు పెండింగ్ పడకుండా చూడాలని, సంబంధిత ఎస్‌హెచ్‌వోలను ఆదేశించామని అన్నారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి చట్టప్రకారం సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సివిల్ సమస్యలను కోర్టులో పరిష్కరించుకోవాలని సూచించామన్నారు. భూ వ్యవహారాల్లో ఎవరైనా బెదిరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాంటి సంఘటనలు ఎదురైతే నేరుగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చన్నారు. సివిల్ తగాదాల్లో ఏ అధికారి కూడా తలదూర్చరాదని, ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22: ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లోని హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు పురుషోత్తం ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతసేవ, అలంకరణ, పుష్పార్చన వంటి కార్యక్రమాలను జరిపించారు. సాయంత్రం శ్రీను గురుస్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి అలంకరణ పూజ, గణపతి, సుబ్రమణ్యపూజ, అభిషేకం, పడిపూజలను కన్నుల పండువగా నిర్వహించారు. గొల్లపల్లికి చెందిన సుధాకర్ భక్తులను అల్పాహారం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్ష ఫలితాలు విడుదల

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 22 : ఫిబ్రవరిలో జరిగిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షల ఫలితాలు విడుదల చేసినట్లు జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను రాసిన అభ్యర్థుల మార్క్స్, మెమోలను ఆన్‌లైన్‌లో ఉంచినట్లు పేర్కొన్నారు.

ప్రజల పక్షాన కొట్లాడుదాం

- కాంగ్రెస్ ప్రభుత్వంపై జనంలో నమ్మకం పోయింది
- బండి సంజయ్‌పై వ్యతిరేకత
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

బలమైన ప్రతిపక్షంగా ఉన్నామని, ప్రజల పక్షాన కొట్లాడుదామని బీఆర్ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు కే తారకరామారావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో సిరిసిల్ల మున్సిపల్ బీఆర్ఎస్ క్లస్టర్ స్థాయి సమావేశాలు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన తీరుపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో చాలా స్థానాల్లో స్వల్ప మెజారిటీ తేడాతో కాంగ్రెస్ విజయం సాధించిందన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై వంద రోజుల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్‌కే విజయావకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే ఫ్రీ బస్సు తీసేస్తామంటున్నారని ప్రజలు కూడా ఆలోచన చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ మోసపు హామీలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల న్నారు. ఐదేళ్లు ఎంపీగా ఉన్న బండి సంజయ్ కరీంనగర్‌కు చేసిందేమీ లేదన్నారు. 'ఐదేళ్లలో ఒక్క పాఠశాలైనా, ఒక్క కళాశాలైనా తీసుకొచ్చాడా? ఒక్క గుడినైనా కట్టాడా? ఒక్క పరిశ్రమనైనా తీసుకొచ్చాడా? ఒక్క రూపాయి పని చేయని బండి సంజయ్‌కి ఓట్లు అడిగే అర్హత లేదు' అని కేటీఆర్ అన్నారు. మోదీ పదేళ్లపాలనలో నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకాయన్నారు. తెలంగాణకు ఏమీ చేయని బీజేపీకి, కరీంనగర్‌కు నయాపైసా పని చేయని బండి సంజయ్‌కి ఓటు ఎందుకు వేయాలో ప్రజ ల్లో చర్చ పెట్టాలన్నారు. రాష్ట్రంలో ఎనిమిది నుంచి పది స్థానాల్లో బీఆర్ ఎస్ గెలిచే అవకాశం ఉందని పలు సర్వే సంస్థలు చెబుతున్నాయన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ గెలుపుతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిరిసిల్లలో మే 10న కేసీఆర్ రోడ్ షో ఉంటుందని,ప్రతీ కార్యకర్త తరలివచ్చి విజయవంతం చేయాలని అన్నారు. కాంగ్రెస్ సాధ్యంకాని హామీలను ఇచ్చి దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిందని, గ్యారెంటీలు అమలు చేయడం సాధ్యంకాదని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణ పాఠం చెబుతారన్నారు. రైతు సమస్యలను గాలికి వదిలేదశారని, ప్రభుత్వం చేతగాని తనంతో అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బంధు అందించలేదని, రుణమాఫీ చేస్తామని నాలుగు నెలలు గడిచినా అమలు చేయలేదని అన్నారు. ఈ ఎన్నికల్లో రైతులను మరోసారీ మోసం చేయడానికి 'ఆగస్టు 15వ తేదీ' అంటూ ముఖ్యమంత్రి కొత్త డ్రామాకు తెరలేపారన్నా రు. లబ్ధి పొందిన కొందరు నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీని వీడి వెళ్తున్నారన్నారు. 'కష్ట కాలంలో నా వెంట నిలిచిన మీకు నేను అండగా ఉంటానని భవిష్యత్తు లో స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ గెలుపు కోసం కష్టపడుతానని అన్నారు. కాంగ్రెస్‌లో చేరాలని ఆ పార్టీ నాయకులు బీఆర్ఎస్ నాయకులను ఒత్తిడి చేస్తున్నారని, కాంగ్రెస్‌లో చేర ని వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని, వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు.ఎవరూ అధైర్యపడవద్దని, అందరికీ అండగా ఉంటానని అన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చక్రపాణి, కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

పాండిచ్చేరీలో రోడ్డు ప్రమాదం

● సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి ● ఎఖీన్‌పూర్‌లో విషాదం



మనీష్ (ఫైల్)

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 21: పాండిచ్చేరిలో రోడ్డు ప్రమాదంలో కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. గ్రామానికి చెందిన చాద రామకృష్ణ -మంజుల దంపతుల కుమారుడు మనీష్ హైదరాబాదులోని ఓ ప్రైవేట్ కంపనీలో రెండు సంవత్సరాలుగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. మనీష్‌తో పాటు మరో ముగ్గురు ఉద్యోగులు చెన్నైతో పాటు పాండిచ్చేరి పట్టణాలకు కంపెనీ పనిలో వెళ్లినట్లు తెలిసింది. చెన్నై నుంచి పాండిచ్చేరికి కారులో మిగితా ఉద్యోగులతో కలిసి వెలుతుండగా రోడ్డు ప్రమాదం జరిగినట్లు మనీష్ బంధువులు తెలిపారు. ప్రమాదంలో మనీష్‌తో పాటు మరో ఉద్యోగి మృతి చెందంగా మిగితా ఇద్దరి గాయాలైనట్లు వారు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనతో దీంతో ఎఖీన్‌పూర్ గ్రామంలో విషాదం అలుముకుంది.

జమ్మికుంటలో 15లక్షల నగదు పట్టివేత



జమ్మికుంటలో నగదు చూపిస్తున్న ఏసీపీ

జమ్మికుంట, ఏప్రిల్ 22: జమ్మికుంట పట్టణంలోని గ్రేన్ మార్కెట్ రోడ్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.15లక్షల నగదు పట్టుబడినట్లు హుజూరాబాద్ ఏసిపి శ్రీనివాస్‌జీ తెలిపారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టుబడిన నగదు వివరాలను ఏసిపి వెల్లడించారు. మున్సిపల్ పరిధిలోని మోత్కులగూడెంకు చెందిన పొనగంటి సురేష్ అనే వ్యక్తి రూ.15లక్షలు నగదు తీసుకు వస్తుండగా పట్టుకున్నారు. పోలీస్‌లు నగదు స్వాధీనం చేసుకోని సీజ్ చేశారు. నగదుకు సంభందించిన ఆధారాలు లేక పోవడం వల్లే సీజ్ చేసినట్లు ఏసిపి తెలిపారు. సమావేశంలో పట్టణ సీఐ వరంగంటి రవి, సిబ్బంది పాల్గొన్నారు. పోలీసుల తనిఖీలు.....రూ. 3 లక్షల పట్టివేత

చందుర్తి : చందుర్తి సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. వేములవాడ పట్టణానికి చెందిన రేగుల రజనీకాంత్ ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.3 లక్షల రూపాయలను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. పట్టుకున్న 3 లక్షల రూపాయలను సీజ్ చేసి, ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

కొండగట్టుకు తరలివస్తున్న హనుమాన్ భక్తులు


కొండగట్టుకు తరలివస్తున్న హనుమాన్ దీక్షాపరులు


ముడుపు కడుతున్న భక్తులు


కొండగట్టులో హనుమాన్ దీక్షాపరులు

● నేడు చిన్న హనుమాన్ జయంతి

మల్యాల, ఏప్రిల్ 22: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో మూడు రోజుల పాటు జరిగే హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి దీక్షాపరులు కొండగట్టుకు తరలి వస్తూ స్వామి వారిని దర్శించుకుని మాలవిరమణ చేస్తున్నారు. వేకువజామున వేలాదిగా భక్తులు అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల కోసం భక్తులు, అంజన్న దీక్షాపరులు వాహనాలు, కాలి నడకన కొండగట్టుకు తరలివస్తున్నారు. కాగా మంగళవారం చిన్న జయంతి కోసం సాయంత్రం నుంచి భక్తుల రద్దీ పెరిగింది. వేలాదిగా భక్తులు తరలి వస్తున్నారు. జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జయంతి ఉత్సవాల ప్రత్యేక అధికారి, వేములవాడ ఈవో కృష్ణప్రసాద్, ఈవో చంద్రశేఖర్, మల్యాల సీఐ నీలం రవి నిరంతరం కొండపైన పర్యవేక్షిస్తున్నారు.


భక్తుల మాల విరమణ

అంజన్న దీక్షాపరులు హనుమాన్ జయంతి సందర్భంగా స్వామి వారి సన్నిధిలో మాల విరమణ చేస్తారు. మాల విరమణ కోసం కల్యాణకట్టలో మండపం ఏర్పాటు చేశారు. ఇందులోనే భక్తులు మాల విరమణ చేస్తున్నారు. కల్యాణకట్ట వద్ద ఓ భక్తుడు తలనీలాలు సమర్పిస్తున్న క్రమంలో క్షురకుడు, ఆలయ సెక్యూరిటీ సిబ్బంది మధ్య గొడవ జరిగింది. అధికారులు, సిబ్బంది ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు.

● ఉచిత బస్సు సౌకర్యం

కొండగట్టుకు వస్తున్న భక్తుల వాహనాలకు జెఎన్‌టీయూ మార్గంలోని బొజ్జ పోతన వద్ద పార్కింగ్ ఏర్పాటు చేయగా అక్కడి నుంచి ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ ఉచిత బస్ సౌకర్యం ఏర్పాటు చేసింది. వివిధ ప్రాంతాల నుంచి తండోపతండాలుగా దీక్షాపరులు కొండగట్టుకు తరలివస్తుండడంతో కొండంతా కాషాయమయంగా మారుతుంది. రామనామంతో అంజన్న సన్నిధి పులకిస్తోంది

ఆంజనేయ స్వామి సన్నిధిలో బుధవారం హనుమాన్ చిన్న జయంతిని దేవస్థానం తరుపున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉత్తర భారత దేశంలో ప్రతియేటా చైత్ర పౌర్ణమి రోజున హనుమాన్ జయంతిని నిర్వహించనుండగా ఇక్కడ కూడా అదే రోజు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారికి అభిషేకం, పట్టువస్త్రలంకరణ చేశారు.


మాల విరమణ చేస్తున్న దీక్షాపరులు

భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు : కలెక్టర్


కొండగట్టులో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

మల్యాల, ఏప్రిల్ 22: కొండగట్టులో జరుగుతున్న చిన్నహనుమాన్ జయంతి వేడుకలకు భక్తులకు ఎలాంటి సమస్యలు కలుగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ షేక్ యాస్మీన్ భాష తెలిపారు. కొండపైన జయంతి ఏర్పాట్లను సోమవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులు తమ దీక్షను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. భక్తులకు సరిపడా టికెట్ కౌంటర్లు తదితరవి ఏర్పాటు చేయగా 114 సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా చేపట్టిన్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారుకులకు భక్తుల కోసం తీసుకోవల్సిన సౌకర్యాలపై పలు సూచనలు చేశారు. దేవస్థానం అధికారుల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూధన్, డీఎస్పీ రఘుచందర్, ఆలయ ఈవో చంద్రశేఖర్, ప్రత్యేక అధికారి కృష్ణప్రసాద్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ధర్మగుండంలో స్నానం చేస్తున్న భక్తులు

అదుపు తప్పి వాహనం బోల్తా

● ఇద్దరికీ తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22: ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఉన్న మూలమలుపు వద్ద సోమవారం ఓ కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో మండల కేంద్రానికి చెందిన సమీర్, ఎల్లంరెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఓ ప్రైవేటు వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గ్రామంలోని సాయికుమార్‌కు చెందిన వాహనాన్ని మరమ్మతు చేయించడం కోసం సమీర్, ఎల్లంరెడ్డిలు కలిసి సిరిసిల్లకు బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో వాహనం అదుపు తప్పి పల్టీకొట్టింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం

ధర్మారం, ఏప్రిల్ 22: మండలంలోని నందిమేడారం గ్రామంలో మేడారం సత్తయ్యకు చెందిన గుడిసె షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం దగ్ధమైంది. గుడిసెలో ఉన్న 10క్వింటాళ్ల బియ్యం, నిల్వ ఉన్న ధాన్యం, దుస్తులు దగ్ధమయ్యాయి. సంఘటన స్థలానికి పెద్దపల్లి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పారు. నిరుపేద కుటుంబానికి చెందిన సత్తయ్యకు ఆర్థిక సహాయం అందజేయాలని స్థానికులు కోరారు. సంఘటన స్థలానికి ఎంఆర్ఐ వరలక్ష్మి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 22: పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన గీత కార్మికుడు బోంగోని చంద్రశేఖర్ సోమవారం ఈతచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా నడుంకు కట్టుకున్న బెల్ట్ తెగడంతో చెట్టు పైనుంచి జారి కిందపడటంతో గాయాల పాలయ్యాడు. స్థానికులు గమనించి క్షతగాత్రుడిని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చంద్రశేఖర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సబ్బితం గౌడ సంఘం సభ్యులు కోరారు.

తాటిచెట్టు పైనుంచి జారిపడి ఒకరు..

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22: ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వరతండాకు చెందిన వ్యక్తి ధరావత్ తిరుపతి ప్రమాదవశాత్తు సోమవారం తాటి చెట్టుపై నుంచి జారి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. చుట్టు పక్కల వారు గమనించి 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని తిరుపతి తాటి ముంజల కోసం తాటి చెట్టు పైకి ఎక్కాడు. ముంజులు కోస్తున్న క్రమంలో కాలు జారి కింద పడ్డాడు. అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల తాటి ముంజల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు పలువురు కింద పడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. తిమ్మాపూర్‌లోని బీమరి దేవయ్య తాటి చెట్టుపై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. తాటి చెట్టు ఎక్కడంలో అనుభవం లేకపోవడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పలువురు పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్యా యత్నం

వీర్నపల్లి, ఏప్రిల్ 22 అనారోగ్యంతో బాధపడుతన్న ఓ మహిళ గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీర్నపల్లి మండలం మద్దిమల్లకు చెందిన పాట్ల సుజాత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. సోమవారం కత్తితో గొంతు కోసుకొని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

రూ.7,400 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 22: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,400 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 32మంది రైతులు 501క్వింటాళ్ల విడి పత్తి, నలుగురు రైతులు ఐదు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,400, కనిష్ఠ ధర రూ.5,500 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

కొండగట్టుకు పాదయాత్ర చేపట్టిన భక్తులు జాగ్రత్తలు పాటించాలి

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 22: కొండగట్టుకు పాదయాత్ర చేపట్టిన భక్తులు జాగ్రత్తలు పాటించాలని జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ పేర్కొన్నారు. హన్‌మాన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి కొండగట్టు ఆలయం వరకు కాలినడకన వెళ్లే భక్తులకు రేడియం స్టిక్కర్ల ద్వారా రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు. సోమవారం జగిత్యాల మండలం తిప్పన్నపేట స్టేజీ వద్ద కాలినడకన కొండగట్టు వెళ్తున్న భక్తులకు రేడియం స్టిక్కర్లను అతికించారు.

కేసీఆర్ నియంత పాలనతోనే అధికారంలోకి కాంగ్రెస్

● పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క సీటు కేటాయించని కాంగ్రెస్ ● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

హుజూరాబాద్, ఏప్రిల్ 22: కేసీఆర్ కుటుంబ నియంత పాలనతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందే తప్ప ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వల్ల కాదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని సాయిరూప గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పదేళ్లలో కేసీఆర్ కుటుంబం అనేక అక్రమాలు చేశారన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగల అభివృద్ధిని అడ్డుకోవడమే కాకుండా అదే సమయంలో బీసీలను రాజకీయంగా అణగదొక్కుతున్నాడన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలను ఓట్లు అడిగే హక్కు కాంగ్రెస్ అధిష్టానానికి కానీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేదన్నారు. కాంగ్రెస్ దృష్టిలో దళితులంటే మాలలు అయినప్పుడు మాదిగల ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికంగా రెడ్డి సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలిచే సీట్లు అగ్రకులాలకు ఇస్తూ ఓడిపోయే సీట్లు బీసీలకు కేటాయించారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి ముస్లింలకు ఇస్తే, రేవంత్‌రెడ్డి హయాంలో ఒక్క మంత్రి పదవి కూడా ముస్లింలకు ఇవ్వలేదన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎమ్మార్పీఎస్ బీజేపీకి మద్దతు ఇస్తుందన్నారు. ముస్లింలు బీజేపీ పార్టీని వ్యతిరేకించవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు చేసేది ఏం లేదన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఆర్ రామచంద్రం, ఎం శ్రీనివాస్, టి వసంత్, వెంకటస్వామి, బి అనిల్, ఆర్ సాగర్, డి రవీందర్, అంజయ్య, టి రాజు, బి సారయ్య, ఆర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

పాత కక్షలతో కుటుంబంపై దాడి

● వాహనాలు ధ్వంసం
● ముగ్గురికి తీవ్ర గాయాలు

కోనరావుపేట, ఏప్రిల్ 22: పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని ఒక కుటుంబంపై రెండు కుటుంబాలకు చెందిన వ్యక్తులు దాడి చేయగా ముగ్గురికి తీవ్ర గాయాల య్యాయి. వారి వాహనాలను ధ్వంసం చేశారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెంది న కుతాడి బాబు కుటుంబానికి, లోకిని ఎల్లవ్వ, ప్రశాంత్ కుటుంబాలతో పాతకక్షలు ఉన్నాయి. 15 రోజుల క్రితం కుతాడి బాబు తమ ఇంట్లో చొరబడి రూ. 50 వేలు ఎత్తుకెళ్లాడని, ఎల్లవ్వ మెడలోని పుస్తెలతాడు దొంగతనానికి ప్రయత్నించాడని కోనరావుపేట పోలీసులకు ఎల్లవ్వ కుమారుడు సతీష్ ఫిర్యాదు చేశాడు. ఈ క్రమం లో ఆదివారం రాత్రి కుతాడి బాబు, అతని తండ్రి కనక య్య, భార్య శిరీష కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో భోజనం చేస్తుండగా లోకిని సతీష్, లోకిని ప్రశాంత్, లోకిని దేవయ్యలతో పాటు వారి కుటుంబసభ్యులు కారంపొడి, గొడ్డళ్లతో, కర్రలతో వచ్చి మహిళలు బాబు కుటుంబ సభ్యులపై కారంపొడి చల్లగా గొడ్డళ్లతో దాడి చేశారు. వారి ఇంటి వద్ద ఉన్న కారు, ట్రాక్టర్, ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. బాబు తండ్రి కనకయ్యకు తీవ్రగాయాలు కాగా కుటుంబ సభ్యులు ప్రాణభయంతో పరుగులు తీశారు. స్నేహితుల సహాయంతో సిరిసిల్ల హాస్పిటల్‌కు వెళ్లారు. విషయం తెలుసుకున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై ఆంజనేయులు హాస్పిటల్ వెళ్లి బాధితులను పరిశీలించి వివరాలను సేకరించారు. అనంతరం ధర్మారం గ్రామంలో జరిగిన ఘటన స్థలాన్ని పరిశీలించారు. కుతాడి బాబు ఫిర్యాదు మేరకు లోకిని సతీష్, ప్రశాంత్, దేవయ్యలతో పాటు వారి కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా : భార్యా భర్తలకు గాయాలు

● పోలీసులు పట్టుకుంటారనే భయంతో ట్రాక్టర్‌ను వేగంగా నడిపిన డ్రైవర్

రామడుగు, ఏప్రిల్ 22: పోలీసులు వెంటపడుతుండగా ట్రాక్టర్‌ను వేగంగా నడిపిన డ్రైవర్ అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు అతని భార్యకు తీవ్రగాయాలయ్యాయి. రామడుగు మండలంలోని గుండి గ్రామంలో ఆదివారం తెల్లవారు జామున ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. రామడుగు మండల కేంద్రానికి చెందిన బత్తిని రవి, కవితలు వడ్డెర కులస్థులు. బతుకుదెరువు కోసం ట్రాక్టర్ నడుపుకుంటూ జీవిస్తున్నారు. ఆదివారం తెల్లవారు జామున రామడుగు వాగు నుంచి ఇసుకను భార్యా భర్తలు ఇద్దరు ట్రాక్టర్ లోడు చేసుకొని గోపాల్‌రావుపేట్‌లో నిర్మాణం జరుగుతున్న స్థలానికి తరలిస్తున్నారు. గోపాల్‌రావుపేట్ బస్టాండ్ సమీపానికి చేరుకునేసరికి తెల్లవారు జామున జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పోలీస్‌స్టేషన్‌కు చెందిన పోలీసులు ఇన్నోవా వాహనంలో ఓ కానిస్టేబుల్ డ్రైవర్‌తో పాటు గస్తీ నిర్వహిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకునేందుకు పోలీసులు వెంటపడగా ట్రాక్టర్‌లో ఉన్న డ్రైవర్ రవి, తన భార్య కవితలు భయంతో ట్రాక్టర్‌ను వెనుకకు మలుపుకొని వేగంగా వెళ్తున్నారు. ఈ క్రమంలో గుండి గ్రామపంచాయతీ సమీపంలో ట్రాక్టర్ అదుపు తప్పి ఇసుకలోడుతో సహ పిల్ల కాల్వలోకి దూసుకెళ్లి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ సంఘటనలో భార్యా భర్తలకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం క్షతగాత్రులను కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.


గుండిలో బోల్తాపడ్డ ట్రాక్టర్

కల్వర్టులోకి దూసుకెళ్లిన కారు

● నూతన వధూవరులతో సహా ఐదుగురికి తీవ్రగాయాలు

మానకొండూర్, ఏప్రిల్ 22 : కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలంలోని గట్టుదుద్దెనపల్లి వద్ద నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టులోకి కారు దూసుకెళ్లిన సంఘటనలో నూతన వధూవరులతో సహా ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. హన్మకొండకు చెందిన దామెర తిలక్ (36), స్వాతిల వివాహం ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో జరిగింది. సోమవారం నూతన వధూవరులు, వరుడి తల్లిదండ్రులు దామెర సురేందర్ (65), దామెర కౌసల్య (55)తో పాటు పెళ్లి కూతురు చెల్లెలు విద్య(20)లు కలిసి ఓకే కారులో ఐదుగురు హన్మకొండకు బయలు దేరారు. మండలంలోని గట్టుదుద్దెనపల్లి ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద జాతీయ రహదారిపై పనులు నడుస్తుండగా నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టులోకి కారు దూసుకపోయింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్రగాయాలు కాగా కారు నుజ్జునుజ్జు అయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజుకుమార్ తెలిపారు.


కల్వర్టులోకి దూసుకెళ్లిన కారు

నర్సరీలో అగ్ని ప్రమాదం

తిమ్మాపూర్, ఏప్రిల్22: తిమ్మాపూర్ మండల కేంద్రంలో రాజీవ్ రహదారికి సమీపంలో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వెనుకాల గల తెలంగాణ వెజిటెబుల్ నర్సరీలో సోమవారం ఉదయం మంటలు చెలరేగాయి. గమనించిన నర్సరీ యాజమని, అందులో పనిచేసే వారు అక్కడికి చేరుకుని మంటలను నివారించేందుకు చాలాసేపు శ్రమపడ్డారు. ఎగిసిపడుతున్న మంటలపై నీటిని చల్లారు. ఈ విషయంపై నర్సరీ యాజమని ఆశా కిరణ్‌ను అడుగగా ట్రేలు ఒకే చోట ఉండటం వల్ల ఎండ వేడిమికి మంటలు అంటుకొని ఉండవచ్చన్నారు. ఈ అగ్ని ప్రమాదంలో దాదాపు 3వేలకు పైగా ప్లాస్టిక్ ట్రేలు, డ్రిప్ సిస్టం పైపులు, గ్రీన్ షెడ్ నెట్ కలిసి సుమారు 4లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని, అధికారులు స్పందించి ఆదుకోవాలని సంఘటన స్థలానికి వచ్చిన తహసీల్దార్ కనకయ్యకు నర్సరీ నిర్వాహకులు విన్నవించారు.


నర్సరీలో మంటలను ఆర్పుతున్న స్థానికులు

మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న లారీ

● ఒకరికి తీవ్రగాయాలు

మానకొండూర్, ఏప్రిల్ 22 : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో మోటార్ సైకిల్‌ను సోమవారం లారీ ఢీకొన్న ప్రమాదంలో మోటార్ సైకిలిస్టుకు తీవ్రగాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని వన్నారం గ్రామానికి చెందిన తాల్లపల్లి సంపత్ అనే వ్యక్తి తన మోటార్‌సైకిల్‌పై గట్టుదుద్దెనపల్లి పెట్రోల్ బంక్‌కు వెళ్లి తిరిగి వన్నారం గ్రామానికి వెళ్తున్నాడు. ఓ లారీ కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వెళ్తుండగా మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంపత్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఘనంగా చౌడాలమ్మ శోభాయాత్ర



ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్థులు

వేములవాడ టౌన్, ఏప్రిల్ 22 : వేములవాడ మున్సిపల్ పరిధిలోని గొల్లపల్లిలో సోమవారం చౌడాలమ్మ విగ్రహ శోబా యాత్రను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. బుధవారం చౌడాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్య క్రమం ఉండడంతో సోమ వారం అమ్మవారి విగ్ర హాన్ని తీసుకొచ్చారు. డీజే సౌండ్స్ మధ్య యువకులు శోభయాత్ర నిర్వహించారు. బుధవారం రోజున ఉదయం చౌడాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన, సాయంత్రం పోచమ్మ బోనాలు, గురువారం సాయంత్రం చౌడాలమ్మ బోనాలుతో ఊరేగింపు, ఆలయానికి చేరుకుని శుక్రవారం ఉదయం ఆలయం వద్ద అమ్మవారి కల్యాణం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు గొల్లకురుమ సంఘం నాయకులు తెలిపారు.

కృష్ణవేణిలో గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో ప్రీ ప్రైమరీ విద్యార్థులు

రుద్రంగి, ఏప్రిల్ 22 : రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ప్రైమరీ విద్యార్థులు కేజీ క్లాసులు పూర్తి చేసుకొని ప్రాథమిక తరగతులలో అడుగుపెడుతున్న సందర్భంగా సర్టిఫికెట్లు అందజేసి ప్రోత్సహించారు. పాఠశాల కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, డైరెక్టర్స్ తీపిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎర్రం గంగా నర్సయ్య, పడాల సురేష్, ప్రిన్సిపాల్ హరినాథ్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న దీక్షాపరులు

కోనరావుపేట, ఏప్రిల్ 22: కోనరావుపేట మండలం సుద్దాలలో హనుమాన్ దీక్షాపరులు హనుమాన్ చిత్రపటంతో సోమవారం శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దీక్షాపరులు ఉప్పుల దేవయ్య, సుంకరి శరత్, వద్లూరి లక్ష్మణ్, గిరి తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు వరి చేను దగ్ధం



ముస్కానిపేటలో దగ్ధమైన వరిచేను

ఇల్లంతకుంట, ఏప్రిల్ 22: మండలంలోని ముస్కానిపేటలో గూడెల్లి హరీష్‌కు చెందిన వరిచేను ప్రమాదవశాత్తు సోమవారం దగ్ధమైంది. బాధితుడి వివరాల ప్రకారం.. వరి, మొక్కజొన్న చేనుల పైనుంచి విద్యుత్ తీగలు వెళ్తున్నాయి. విద్యుత్‌తీగలు ఒకదానికొకటి తగిలి మంటలు చెలరేగడంతో కిందపడి 20 గుంటల వరి చేను, 30గుంటల మొక్కజొన్న చేను దగ్ధమయ్యాయి. దాదాపు రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

వాహనాల తనిఖీ

ఇల్లంతకుంట, ఏప్రిల్ 22: వాహనాలు అధిక శబ్దకాలుష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజుగౌడ్ అన్నారు. మండలకేంద్రంలో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సైరన్ పెట్టుకొని నడుపుతున్న వాహనాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కేసీఆర్ ఆత్మగౌరవ సముదాయంలో స్థానిక అశ్విని ఆసుపత్రి వారు సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 30 మందికి కంటి పరీక్షలు చేశారు. శస్త్ర చికిత్స అవసరం ఉన్న వారిని గుర్తించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22: ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లిలో ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు నెత్తెట్ల చిన్నమల్లయ్య కుటుంబాన్ని జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు సోమవారం పరామర్శించారు. రైతుకుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు నర్సింహారెడ్డి, శేఖర్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యం చోరీ

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆదివారం రాత్రి ధాన్యం చోరీకి గురైందని రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేంద్రంలో ధాన్యం ఆరబెట్టిన రైతు ఇతరుల రైతుల ధాన్యాన్ని ఎత్తుకెళ్లి కుప్పగా పోసుకున్నాడని తెలిపారు. 5 క్వింటాళ్ల ధాన్యం ఎత్తుకెళ్లాడని పేర్కొన్నారు. చోరీకి పాల్పడిన రైతును అదుపులోకి విచారిస్తున్నట్లు తెలిసింది. కేంద్రంలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి పూట అంధకారం నెలకొంటుందని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా కేంద్రం నిర్వాహకులు, అధికారులు వసతులు కల్పించాలని కోరుతున్నారు.

పాఠశాలలో చోరీకి యత్నం

చందుర్తి ఏప్రిల్ 22 : చందుర్తి మండలం తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం రాత్రి దొంగలు చోరీకి యత్నించారు. ప్రాథమిక పాఠశాల కార్యాలయం తలుపులను పగలగొట్టేందుకు బండరాయితో యత్నించగా తలుపులు తెరుచుకోకపోవడంతో అక్కడి వెళ్లిపోయారు. పాఠశాల ఆవరణలో కొందరు యువకులు మద్యం తాగుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని, పోలీసులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

యువతి అదృశ్యం... కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22: ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి చెందిన బండారి సుజాత అనే యువతి అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ సోమవారం తెలిపారు. యువతి తండ్రి బాబు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కథలాపూర్‌లో కురిసిన భారీ వర్షం

కథలాపూర్, ఏప్రిల్ 22 : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు గంట సేపు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో రైతన్న తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కోతలు పూర్తి చేసిన రైతులు తమ వరి ధాన్యంను కేంద్రాల్లో ఆరబెట్టారు. అయితే ఒక్కసారిగా వర్షం రావడంతో ధాన్యం తడిచి ముద్దయింది. గత మూడు రోజుల కింద కురిసిన వర్షం వల్లె ధాన్యం మొలకలెత్తగా మరో మారు రైతులకు కష్టాలు తప్పడం లేదు. అదేవిధంగా తూకం వేసిన ధాన్యంను రైస్ మిల్లులకు తరలించేందుకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని నిర్వాహకులు వాపోతున్నారు.

మూల మలుపులు.. ప్రమాదాలకు నిలయాలు



మర్రిగడ్డ మూలమలుపు



చందుర్తి అంబేడ్కర్ బస్టాండ్ వద్ద



చందుర్తి చర్చి సమీపంలో మూలమలుపు

- కనిపించని సూచిక బోర్డులు - తరచూ ప్రమాదాలు
- వాహనదారుల ఇబ్బందులు - పట్టించుకోవాలని విజ్ఞప్తి

చందుర్తి, ఏప్రిల్ 22 : మండలంలోని పలు గ్రామాల్లో మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతూ వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురై గాయాలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. మండలంలోని కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిలోని మూడపల్లిలోని బస్టాండ్ సమీపంలోని మూలమలుపు వద్ద ద్విచక్రవాహన దారులు అదుపు తప్పి కింద పడడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. మర్రిగడ్డ గ్రామంలోని శుభాష్ విగ్రహం మూలమలుపు వద్ద ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇప్పటి వరకు ఇక్కడ 15కి పైగా ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. గతంలో ఓ కారు మూలమలుపు వద్ద అదుపుతప్పి హోటల్‌లోకి దూసుకరావడంతో అక్కడున్న గ్రామస్థులు అప్రమత్తమై ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. లేకపోతే కారు దూసుకెళ్లేది. మర్రిగడ్డ గ్రామంలోని మసీద్ సమీపంతోపాటు చందుర్తి అంబేద్కర్ బస్టాండ్ వద్ద రెండు సంవత్సరాల క్రింతం ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనదారుడిని ఢీ కొనడంతో యవకుడి నడుముకు బలమైన దెబ్బ తగిలింది. ఇప్పటికీ ఆ యువకుడు ఇంటి నుంచి బయటకు వచ్చి పనులు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నాడు. మూడు నెలల క్రితం ఆర్టీసీ బస్సు వృద్ధుడిని ఢీ కొనడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. చర్చి సమీపంలో, తెలంగాణ తల్లి విగ్రహం, బస్టాండ్ ప్రాంతంతోపాటు మల్యాల, లింగంపేట, మూడపల్లి తదితర గ్రామాల్లోని మూలమలుపుల వద్ద రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు సూచిక బోర్డులతోపాటు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

- బాశెట్టి భాస్కర్, చందుర్తి.



మండలంలోని పలు గ్రామాల్లో మూలమలుపుల వద్ద ఆర్అండ్‌బీ అధికారులు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి. ఈ రహదారిపై కొత్త వ్యక్తులకు మూలమలుపులు తెలియకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు ప్రమాదాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలి.

వేగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

- దుమ్మ అంజయ్య, మాజీ సర్పంచ్ రామన్నపేట



చందుర్తి మండలంలోని పలు గ్రామాల్లోని కోరుట్ల వేములవాడ ప్రధాన రహదారిలో వెళ్లే ప్రయాణికులకు మూల మలుపుల వద్ద వేగ నియంత్రణకు చర్యలు చేపట్టాలి. ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ఆర్అండ్‌బీ అధికారులుపై ఉంది. ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలి.

మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలి

- చిర్రం తిరుపతి, మాజీ ఉప సర్పంచ్, చందుర్తి.



కోరుట్ల నుంచి వేములవాడకు నిత్యం రాజరాజేశ్వర స్వామి దర్శించేందుకు భక్తులు వివిధ వాహనాల్లో వెళ్తారు. ఈ మార్గం నుంచి వెళ్లే భక్తులకు మూల మలుపులు తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు మూల మలుపు వద్ద రోడ్డు విస్తరించాలి తగిన చర్యలు తీసుకోవాలి.

చర్యలు తీసుకోవాలి

- బొడిగె అనిల్, మాజీ ఉపసర్పంచ్, మర్రిగడ్డ



మరిగడ్డలోని సుభాష్ విగ్రహం వద్ద మూలమలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇప్పటికే పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటివరకు ప్రమాదాలు జరగకుండా ఎలాంటి రక్షణ చర్యలూ చేపట్టలేదు. ప్రమాదాలు జరగకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

'వెలిచాల' నామినేషన్‌కు తరలిన నాయకులు



ఎల్లారెడ్డిపేట నుంచి కరీంనగర్‌కు వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 22 : కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు నామినేషన్‌కు మద్దతుగా సోమవారం సిరిసిల్ల పట్టణం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ, సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడ చొప్పదండి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, ఉపాధ్యక్షుడు దేవయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఖాజా, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, మైనర్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అహ్మద్, కౌన్సిలర్లు కుడికాల రవికుమార్, వేముల రవి, భూక్య రెడ్యానాయక్, రైతు బంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మీనారాయణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: కరీంనగర్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావు నామినేషన్ దాఖలు నేపథ్యంలో ఎల్లారెడ్డిపేట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ శ్రేణులు సోమవారం కరీంనగర్‌కు తరలి వెళ్లాయి. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, రాజేందర్, రాజునాయక్, రాజయ్య, దత్తాద్రిగౌడ్, బాల్‌రెడ్డి, రాజ్‌కుమార్, బాబు, దేవేందర్‌యాదవ్, మహేందర్, బాలకిషన్, బాలాగౌడ్, అంజిరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, కనకరాజు, రాజు, జ్యోతి, శోభ తదితరులు ఉన్నారు.

ఇల్లంతకుంట: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా రాజేందర్ రావు సోమవారం నామినేషన్ వేయగా మండలంలోని పలు గ్రామాల నాయకులు తరలివెళ్లారు. ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, పీసీసీ కోఆర్డినేటర్ పాశం రాజేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, అధికార ప్రతినిధి పసుల వెంకటి, మాజీ ఎంపీపీ అయిలయ్య, నాయకులు భాస్కర్‌రెడ్డి, కేశవరెడ్డి, తిలక్, కనుకయ్య, రాంప్రసాద్, శ్రీనివాసగౌడ్ తదితరులు ఉన్నారు.

మేడిపల్లి కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 22: మండలంలోని మేడిపల్లి గ్రామంలోని భూవివాదంలో వ్యవహరిస్తున్న తీరు పట్ల పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన అడెపు సౌమ్య కలెక్టర్‌కు సోమవారం ఫి ర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని ఇంటి నం బర్లు 4-121, 4-122ల ఇళ్ల స్థలాలను 2022లో కొనుగోలు చేశామన్నారు. స్థలం లో షటర్ నిర్మాణం కోసం టీఎస్ బీపాస్ ద్వారా దరఖాస్తు చేసుకున్నామన్నారు. గ్రామంలోని మున్నూర్ కాపు సంఘానికి స్థలంపై ఎలాంటి హక్కులు లే కున్నా అభ్యంతరం తెలపడంతో పంచాయతీ కార్యదర్శి సంఘం సభ్యులకు మద్దతుగా షటర్ నిర్మాణానికి నిరాకరిస్తున్నారన్నారు. దీంతో మెట్‌పల్లి కోర్టు నుంచి మున్నూర్ కాపు సభ్యులపైన ఇంజంక్షన్ ఆర్డర్ సైతం తీసుకొచ్చి షటర్ నిర్మాణం కోసం గుంతలు తవ్వామన్నారు. సంఘ సభ్యులు తమ పైన కోర్టులో కేసు వేస్తావంటూ గుంతలను పూడ్చి ఇటుకలను ధ్వం సం చేశారని, దీంతో సంఘం సభ్యులపైన ఈనెల 13న ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదన్నారు. మున్నూర్ కాపు సభ్యులకు మ ద్దతుగా ఉండి తవ్విన గుంతలను పూడ్చి వేయాలని, దరఖాస్తును నిరాకరించడమే కాకుండా వారితో రాజీచేసుకోవాలని బెదిరింపులకు పాల్పడుతున్నా డని పంచాయతీ కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన



స్వామివారిని దర్శించుకుంటున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఏప్రిల్ 22 : వేములవాడ మండలం ఆరెపల్లిలోని భక్తాంజనేయస్వామి దేవాలయంలో సోమవారం ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన, నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయానికి వచ్చిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, గ్రామ అధ్యక్షుడు ఇటిక్యాల వెంకటేష్, కాంగ్రెస్ కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు ఇటిక్యాల లింగయ్య, మాజీ సర్పంచ్‌లు ఇటిక్యాల నవీనరాజు, సిలివేని మల్లేశం తదితరులు ఉన్నారు.

పశువుల షెడ్డు, పశుగ్రాసం దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో భారీగా వీచిన గాలికి మామిడి కొమ్మ విరిగి విద్యుత్ తీగలపై పడడంతో ఒక్కసారిగా నిప్పురవ్వలు ఎగిసి పడి పశువుల షెడ్డు, పశుగ్రాసం దగ్ధమయ్యాయి. మంటల్లో చిక్కుకున్న గేదె మృత్యువాత పడింది. ప్రత్యక్ష సాక్షులు, బాధిత రైతు కథనం మేరకు.. గ్రామంలోని రైతు ఇల్లెందుల రాజిరెడ్డి తన వ్యవసాయ పొలం సమీపంలో పశువుల షెడ్డును ఏర్పాటు చేసుకుని గడ్డివామును నిల్వ చేశాడు. మధ్యాహ్నం వీచిన గాలికి మామిడి కొమ్మ విరిగి కరెంటు తీగలపై పడడంతో నిప్పురవ్వలు ఎగిసి పడి మంటలు వ్యాపించాయి. చుట్టు పక్క రైతులు చేరుకొని మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. సమాచారం అందుకున్న ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న సిబ్బంది స్థానికులతో కలిసి మంటలను ఆర్పివేశారు. రూ.60 వేల విలువైన పశుగ్రాసం, రూ.20 వేల విలువైన గేదె మృత్యువాత పడిందని బాధిత రైతు రాజిరెడ్డి తెలిపాడు. సుమారు రూ. లక్ష నష్టం వాటిల్లిందని పేర్కొన్నాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. పొలాల వద్ద విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో ఉండి ప్రమాదకరంగా మారాయని, పలుమార్లు సెస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని వాపోయాడు.

నిలిచిన పాఠశాల భవన నిర్మాణ పనులు

- వచ్చే ఏడాదైనా అందుబాటులోకి వచ్చేనా?



అర్ధంతరంగా నిలిచిన పాఠశాల భవనం పనులు



అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనంలో విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 22: విద్యార్థులకు ఆధునిక వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నూతన బడి భవనాలు నిర్మించేందుకు నిధులను కేటాయించింది. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఏడాది కిందట ప్రారంభించారు. అధికారుల పర్యవేక్షణ లేమితో పనులు ముందుకు సాగడం లేదు. చేసిన పనులకు సకాలంలో బిల్లులు అందకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్, నారాయణపూర్ గ్రామాల్లో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల భవన నిర్మాణాలకు అధికారులు బిల్లులు చెల్లించకపోవడంతో బడి భవన నిర్మాణాలు నిలిచిపోయాయి.ఇరుకైన గదుల్లో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొత్త విద్యా సంవత్సరంలో కొత్త భవనాల్లో విద్యనభ్యసించాల్సిన విద్యార్థులకు పాత తిప్పలు తప్పేలా లేవు. బొప్పాపూర్, నారాయణపూర్‌లోని పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరానికి కూడా పూర్తికావేమోనన్న అనుమానం తలెత్తుతోంది.

అసంపూర్తిగా పనులు

ఎల్లారెడ్డిపేట మండలంలో 'మన ఊరు- మన బడి' కార్యక్రమంలో భాగంగా బొప్పాపూర్, నారాయణపూర్, అల్మాస్‌పూర్, వెంకటాపూర్, రాజన్నపేట, బండలింగంపల్లి, గొల్లపల్లి, సింగారం గ్రామాల్లో ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను కలిపి మొత్తం 12 పాఠశాలలను అధికారులు ఎంపిక చేశారు. భవన నిర్మాణాలకు అప్పటి సర్కారు నిధులను మంజూరు చేసింది. మొదటి విడతలో చేపట్టిన బండలింగంపల్లి, రాజన్నపేట, అల్మాస్‌పూర్, వెంకటాపూర్, సింగారం గ్రామాల్లో పనులు చివరి దశకు చేరుకున్నాయి. కొన్ని గ్రామాల్లో పనులు పూర్తవడంతో భవనాలను ప్రారంభించారు. బొప్పాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 480 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మన ఊరు- మన బడి కింద రూ.50 లక్షలు, మరో రూ.20 లక్షలు సీఎస్ఆర్ నిధులతో పనులను ప్రారంభించారు. పాత తరగతి గదులను తొలగించడంతో మిగిలిన ఆరు గదుల్లో బోధన సాగిస్తున్నారు. నారాయణపూర్‌లోని ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణానికి రూ.26.50 లక్షలు మంజూరు చేశారు. ఏడాదిగా పనులు సాగుతూనే ఉన్నాయి. కార్పొరేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామని చేపట్టిన పనులు బిల్లులు అందక ముందుకు సాగడం లేదు. పనులు జరుగుతున్న చోట ఇసుక, కంకర, సిమెంటు నిల్వ చేయడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వచ్చే ఏడాది తమ పిల్లలకు ఇబ్బందులు తప్పవని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి బడి భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని కోరుతున్నారు.

డబ్బులు రాలేదు

- కొండ రమేశ్‌గౌడ్, సబ్ కాంట్రాక్టర్- బొప్పాపూర్, ఎల్లారెడ్డిపేట



బొప్పాపూర్‌లో 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులను ఎనిమిది నెలల కిందట చేపట్టాను. సబ్ కాంట్రాక్టర్‌గా పనులు చేస్తున్నా. అప్పులు చేసి పనులు చేశా. ఇప్పటి వరకు నయా పైసా బిల్లు రాలేదు.

పూర్తయ్యేలా చూస్తాం

- అశోక్‌రావు, ఏఈ- టీఎస్‌టీడబ్ల్యూఐడీసీ



అసంపూర్తిగా ఉన్న పాఠశాలల భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తాం. బిల్లులు సకాలంలో చెల్లించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వేసవి సెలవుల్లో పనులు పూర్తి చేసి కొత్త విద్యా సంవత్సరంలో అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపడుతాం.